నేడు మండల సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట్: శామీర్‌పేట్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాణి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ ఎల్లుబాయి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

శ్రీగోదాదేవికి ఘనంగా దీపోత్సవం



ఘట్‌కేసర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారికి దీపోత్సవం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి మంగళ హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మార్సీఈ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటుకున్న సాహిణిరెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని సాహిణిరెడ్డికి జేఎన్‌టీయూహెచ్ గోల్డ్ మెడల్ వరించింది. బీటెక్ ఐటీఈ విభాగంలో జేఎన్‌టీయూహెచ్‌లో ప్రథమ స్థానంలో నిలవడంతో ఇటీవల నిర్వహించిన జేఎన్‌టీయూహెచ్ స్నాతకోత్సవంలో ఆమెకు ఇస్రో చైర్మన్ సోమనాథ్, యూనివర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డిలు గోల్డ్‌మెడల్ అందజేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి, అధ్యాపకులు, యాజమాన్యం అభినందించి సత్కరించారు. ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు.

అయోధ్య అక్షింతలు ఇంటింటికీ పంపిణీ



అక్షింతలు అందజేస్తున్న నాయకులు, రామభక్తులు

మేడ్చల్‌రూరల్: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ, గుండ్లపోచంపల్లిలో ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ పెంటయ్య, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, రామభక్తులు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, రాజు, మల్లేశ్, నర్సింగరావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్న వ్యక్తి

ఘట్‌కేసర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్న ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎదులాబాద్‌కు చెందిన కందుల నరేశ్(36) దినసరి కూలీ. ఆరేళ్లుగా అతడు మద్యానికి బానిసై అప్పుడప్పుడు మత్తులో తన తండ్రితో గొడవ పడేవాడు. అదేవిధంగా సోమవారం కూలీ లభించకపోవడంతో పనిలేక మద్యం తాగాడు. రాత్రి మద్యం మత్తులో తండ్రితో గొడవ పడుతూ ఆవేశంలో స్టవ్‌లో ఉన్న డీజిల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటిచుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



వ్యవసాయ బావిలో మృతుడు రమేశ్ మృతదేహం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లో ఓ ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ మహేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌కు చెందిన ఓర్సు రమేశ్(25) ట్రాక్టర్ డ్రైవర్. కొన్నాళ్ల క్రితం అతడికి వివాహం కాగా భార్య అతడిని వదలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా జీవిస్తూ మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండగా వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. బాధ భరించలేక మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం ఓ వ్యవసాయ బావిలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి రమేశ్‌గా గుర్తించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సహకార సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

కీసర: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం అధ్యక్షుడు రామిడి ప్రభాకర్ రెడ్డి మంగళవారం కీసరలో ఆవిష్కరించారు. సహకార సంఘ ఉపాధ్యక్షుడు పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు మాలోత్ ధర్మ, మచ్చాని మల్లేష్, కామసాని మల్లారెడ్డి, యాదిరెడ్డి, భూపాల్‌రెడ్డి, కొకుట్ల చిన్న అంజిరెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకి నివాళి



మల్కాజిగిరి: తెలంగాణ విశ్వబ్రాహ్మణ మహిళా సమితి అధ్యక్షురాలు సువర్ణ ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి వసంతపురి కాలనీలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఓబీసీ జాతీయ చైర్‌పర్సన్ భాగ్య లక్ష్మీ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబిక, నాగమణి, రజిని, వరలక్ష్మీ, నీలమ్మ తదితులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

జాగ్రత్త

చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

- పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలి
- అన్ని ప్రాంతాల్లో మరింత గస్తీ పెంచుతాం..
- అనుమానం వస్తే 100కు డయల్ చేయండి



ప్రచారం ఆటోను ప్రారంభిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు

ఘట్‌కేసర్: సక్రాంతి వేడుకలను సొంతూరిలో సరదాగా జరుపుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతుంటారు. పట్టణాల్లో ఉంటున్న వారు పిల్లాపాపలతో సొంత గ్రామాలకు పయనమవుతుంటారు. అదను చూసుకొని చోరులు చేతివాటం చూపుతుంటారు. ప్రధానంగా తాళం వేసి ఉన్న ఇళ్లు, దూరంగా ఉన్న కాలనీలోని ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తుంటారు. మేడ్చల్ నియోజకవర్గంలో మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, కీసర, నాగారం, పోచారంకు విద్య, ఉపాధి కోసం వచ్చి నివాసం ఉంటారు. ఈ నెల 15న జరుగనున్న సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార ఆటోను మంగళవారం ప్రారంభించారు.

పోలీస్ శాఖ సూచనలు..

ఇంటిల్లిపాది ఇతర ప్రాంతాలకు వెళ్లేప్పుడు మన ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి తెలిపాలి. వాహనాలకు వీల్‌లాక్‌తో పాటు హ్యాండ్ లాక్ చేయాలి. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను బిగించుకోవాలి. ఇంటి లోపలి ద్వారాలు, కిటికీలకు గడియా పెట్టాలి. తాళం కనిపించకుండా కర్టెన్లు వేయాలి. ఇంటి లోపల ఓ లైట్ వెలిగేలా చూడాలి. విలువైన వస్తువులు, ఆర్థిక విషయాలు, ఆభరణాల గురించి ఇతరులకు చెప్పకూడదు. పేపర్ బాయ్, పాలవాడిని రావొద్దని చెప్పాలి. ప్రధాన ద్వారం ముందు గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. బయటి గేటుకు తాళం వేయకూడదు. ఇంటి ముందు చెప్పులు పెట్టండి. బీరువాలో ఆభరణాలు, నగదు ఉంచవద్దు. బయటకు వెళ్లినప్పుడు, ముగ్గులు వేసేటప్పుడు మెడలో బంగారు ఆభరణాలు జాగ్రత్త. నమ్మకమైన వారికి, పీఎస్‌లో సమాచారం ఇవ్వాలి.



నాగారంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పండుగకు గస్తీ పెంచుతాం..

పండుగకు ఊరెళ్లిన వారు పోలీసుల సూచనలు పాటించాలి. కాలనీలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వండి. పండుగకు పోలీసులు గస్తీని పెంచుతాం. ఏమైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నంబర్ 100కు డయల్ చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి.



మద్ది మహేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కీసర: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కీసర సీఐ వెంకటయ్య కోరారు. పండగ సందర్భంగా జరిగే దొంగతనాలపై నాగారం మున్సిపాలిటీలో ప్రజలకు పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. మైకులతో ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లకు తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి

- స్థానిక నాయకులు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి
- రాబోయే పురపాలిక, జీపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవాలి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌కు కూడా చెప్పాం
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర, శివారు జిల్లాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి టికెట్ స్థానికులకు మాత్రమే కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. స్థానికేతరులకు టికెట్ ఇవ్వవద్దని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో దాదాపు 38 లక్షల ఓటర్లు ఉంటారని, మినీ భారత్‌గా.. ఈ నియోజకవర్గానికి గుర్తింపు ఉందని వారు తెలిపారు. స్థానికేతరులకు ఎంపీ టికెట్ కేటాయిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ కేటాయింపులో ఈ ప్రాంత ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతిభావంతులు, ప్రభావశీలురైన నాయకులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఏ నాయకుడికి ఎంపీ టికెట్ కేటాయించినా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నిరుత్సాహానికి గురైన కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు స్థానిక నాయకులకు ఎంపీ టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని బీజేపీ నాయకులు కోరారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ నాయకులు డా.కె.లక్ష్మణ్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాలి సంపత్ యాదవ్, నాయకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



జవహర్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో గంజాయి అమ్ముతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ మార్కెట్ వీధిలో గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. జరుపుల దుర్గాప్రసాద్(21), జావిద్‌ఖాన్(20)ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి సహకరించాలి

జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసి సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాపురం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికల్లో ఓటరు స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం



అల్వాల్: అల్వాల్ డివిజన్ వాసవీనగర్ కాలనీవాసులు మంగళవారం జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ సరిగ్గా జరగలేదని, ఒకే కుటుంబంలోని సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారని, మృతిచెందిన లేదా వేరే స్థలంలోకి మారినా వారిని లిస్టు నుంచి తొలగించలేదన్నారు. దీంతో పోలింగ్ 60 శాతం కూడా జరగలేదన్నారు. ఈ విషయాలను గ్రహించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్ రావు, పెద్ది రమేష్, వెంకటేశ్వర్లు, పద్మాచారి, బాల గంగాధర్‌రావు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



కుషాయిగూడ: ప్రభుత్వాలు ఉచిత పథకాలకు స్వస్తి పలికి విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ విద్యార్థుల రాజకీయ పార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరుతూ మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రాజకీయ పార్టీల ప్రముఖులు మాట్లాడుతూ ఉచిత పథకాలతో అప్పులపాలు కావడం తప్పా ఒరిగేదేమీ లేదన్నారు. ఉచిత పథకాలకు స్వస్తి పలికి ప్రభుత్వాలు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల రాజకీయ పార్టీ ఫౌండర్ సునీల్, గ్రేటర్ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

గోవాలో చిల్ అయిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

నిన్న మొన్నటి వరకు ఎన్నికల హడావుడితో అలసిపోయిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గోవాకు వెళ్లి చిల్ అయ్యారు. ఆయన తన బృందంతో కలిసి గోవాకు వెళ్లి అక్కడ సముద్రంలో బోటింగ్, స్కూబాడైవింగ్ చేశారు. బోటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గోవాలో ఆయన చేసిన జల్సాల ఫొటోలు వైరల్ అయ్యాయి. పలువురు నెటిజన్లు మల్లన్నా.. మజాకా అంటూ కామెంట్స్ చేశారు. –మేడ్చల్



చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ అందజేస్తున్న హెచ్‌బీఎల్ ప్రతినిధులు

శామీర్‌పేట్: పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చేయడమే లక్ష్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ క్రిష్ణారెడ్డి, సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పర్‌పల్లి, అంతాయపల్లి, హకింపేట్, సింగాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో హెచ్‌బీఎల్ సంస్థ సౌజన్యంతో అందజేస్తున్న పౌష్టికాహార వితరణను మంగళవారం ప్రారంభించారు. చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. హెచ్‌బీఎల్ సంస్థ సహకారంతో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యం పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాలకు ఎల్ఈడీ టీవీ, ప్రెషర్ కుక్కర్, ఇతర వస్తువులతో పాటు పిల్లలకు రెండు జతల యూనిఫాం, పాలు తాగేందుకు కప్పులు అందజేశారు. హెచ్‌బీఎల్ ప్రొడక్షన్ జీఎం సుధాకర్, స్థానిక కౌన్సిలర్ పాండు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, క్రిష్ణంరాజు, కల్పన, అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

– జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఇన్‌స్పెక్టర్ సీతారాం ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విజన్‌తో ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. వారి బాల్యం నుండే సామాజిక దృక్పథం అలవర్చుకోవాలన్నారు. చదువుతోనే సమాజంలో నెలకొన్న రుగ్మతను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ఏసీఈ ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ, అధ్యాపకులు

విద్యార్థులకు అభినందనలు

ఘట్‌కేసర్: ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో అంకుషాపూర్ ఏసీఈ కళాశాలకు చెందిన 151 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం కళాశాల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌పై ట్రెయినింగ్ ఇవ్వడంతో ఏసీఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.4.5 లక్షల నుంచి రూ.6.5 లక్షల వరకు వేతనం అందనుందన్నారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, శిక్షణ అధికారి దుర్గప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏసీఈ కళాశాల సంయుక్త కార్యదర్శి పద్మావతి, ప్రిన్సిపల్ బీఎల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీలు నిర్మించాలని రైల్వే అధికారులకు వినతి



రైల్వే అధికారితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో వివిధ రైల్వే క్రాసింగ్‌లలో ఆర్‌యూబీలు నిర్మించాలన్నారు. హైదరాబాద్ డివిజన్ పరిధిలో వచ్చే మల్కాజిగిరి ఆర్‌యూబీలు మౌలాలి(ఉప్పర్ గూడ), గౌతంనగర్, కాకతీయనగర్, వినాయక్‌నగర్, మౌలాలి రైల్వే స్టేషన్, వాజ్‌పేయ్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి చెందిన అల్వాల్ సర్కిల్‌లోని లయోలా కాలేజ్, సుచిత్ర, మచ్చబొల్లారం తదితర ప్రాంతాల్లో ఆర్‌యూబీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేష్ విస్నాయ్, సికింద్రాబాద్ డివిజన్ మేనేజర్ సురేష్‌బాబుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మురుగేష్, ఈఈ గోపాల్, డిప్యూటీ ఈఈ సుదర్శన్, డీఈ.రాంచందర్, వాటర్ వర్క్స్ ఏఈ దీపక్ ఉన్నారు.

మల్లాపూర్ రెడ్డి సంఘం కేలండర్ ఆవిష్కరణ

మల్లాపూర్: మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను మంగళవారం సంఘం కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రెడ్డి విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. సంఘం అభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, గుడి గోపురం ముత్యంరెడ్డి, ఆలేటి భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, కొత్త మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

CAUTION NOTICE

General Public is hereby cautioned that some unknown persons being in illegal possession of Original Sale Deeds document bearing (1) No. 9166/1992, dated 05.11.1992; (2) No. 9167/1992, dated 05.11.1992; (3) No. 9168/1992, dated 05.11.1992; and (4) 5373/1993 dated 30.04.1993, and without any without any right, title or rightful claim are trying to alienate Plot Nos.134, 135, 136 & 243, each admeasuring 200 Sq.Yards totalling to 800 Sq.Yards in Sy.Nos.286 & 287 of Rampally Village, Nagaram Municipality, Keesara Mandal, Medchal-Malkajgiri District. Boundaries for plot No.134 are North 30'Wide Road, South: Plot No.135, East : 25' Wide Road, and West : Plot No.105. Boundaries for Plot No.135 are North : Plot No.134, South: Plot No.136, East : 25' Wide Road, and West : Plot No.104. Boundaries for Plot No.136 are North : 135, South: Plot No.137, East 25' Wide Road, and West : Plot No.103. Boundaries for Plot No.243 are North : Plot No.242, South: Plot No.244, East : 30' Wide Road, and West : Plot No.228. The said properties belongs to my clients that Sheshank Nandi Durgaiah, K.R. Ravi Kumar and Kanaka Rithika by virtue of registered documents bearing Nos. 6334/2021, 6335/2021 & 6336/2021 (Gift Settlement Deed), all dated 27.03.2021 of SRO Keesara and a Sale Deed Doct No.19938/2006, for which the link documents are (1) No. 9166/1992, dated 05.11.1992; (2) No. 9167/1992, dated 05.11.1992; (3) No. 9168/1992, dated 05.11.1992; and (4) 5373/1993, dated 30.04.1993, as stated above. Anybody dealing with the said property with any person other than me would be doing so at their own risk, costs and consequences arising thereof.

Sd/- T.Veerendera Kumar, Adovcate
201, Aditya Towers, Vinayak Nagar, Neredmet, Secunderabad-500056
Mobile: 9989044802

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387